క్లుప్తంగా

వైభవంగా విగ్రహ పునః ప్రతిష్ఠ



పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న భక్తులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా పోతురాజు స్వామి ఆలయానికి విగ్రహానికి పునః ప్రతిష్ఠ జరిగింది. దేవదాయశాఖ ఈఓ ఉండవల్లి వీర్రాజుచౌదరి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆదివారం ఈ విగ్రహ పునఃప్రతిష్ఠ జరిగింది. గ్రామానికి చెందిన దాత వైట్ల చిన్నబ్బు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ విగ్రహ ప్రతిష్ఠను అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సుంకర శ్రీరామ్



శ్రీరామ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రామకృష్ణారెడ్డి, స్వామి తదితరులు

ఆలమూరు: మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా సుంకర శ్రీరామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చొప్పెల్లలో మండల శాఖ అధ్యక్షుడు నాగిరెడ్డి స్వామి అధ్యక్షతన ఆదివారం మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పరిశీలకులుగా తమలంపూడి రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబుగౌడ్ విచ్చేశారు. నిర్వహించిన ఎన్నికల్లో సహచర సభ్యులు నూతన అధ్యక్షుడిగా సుంకర శ్రీరామ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం పరిశీలకుడిగా వచ్చిన రామకృష్ణారెడ్డి నియామక పత్రాన్ని శ్రీరామ్‌కు అందజేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్డి దొరయ్యనాయుడు, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు ఎంవీ కృష్ణారెడ్డి, బలుసు శ్రీను, తోరాటి ఆంజనేయులు, కె.రాఘవేంద్ర, కె.గంగిరెడ్డి పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు స్వామి చిత్రపటం ఇస్తున్న అర్చకుడు శ్రీనివాస్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం కడప జిల్లా రైల్వేకోడూరు ఎమ్మెల్యే ఎ.శ్రీధర్ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటాన్ని ఆయనకు, ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ అందజేశారు.

మసీదుల్లో రంజాన్ ప్రార్థనలు

మామిడికుదురు: ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ ప్రార్థనలు ఆదివారం ఘనంగా జరిగాయి. తెల్లవారు జామున సహరితో ప్రారంభమైన రంజాన్ ఉపవాస దీక్షలు రాత్రి ఇఫ్తార్‌తో ముగిశాయి. దీనిలో భాగంగా మామిడికుదురు మండలంలోని మసీదుల్లో జరిగిన ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొన్నారు. మామిడికుదురు షియా జామియా మసీదులో జరిగిన ప్రార్థనల్లో మత ప్రబోధకుడు షబ్బర్ అలీజైదీ పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల కళా వైభవం

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలోని శ్రీలక్ష్మీ స్కూల్‌లో ఆదివారంవార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా కరస్పాండెంట్ మట్టా నాగరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బృందం పర్యవేక్షణలో స్థానిక స్కూల్ ప్రాంగణంలో చిన్నారుల ప్రదర్శించిన నృత్య ప్రదర్శన కళా వైభవం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన పలు కళారూపాలు, సందేశాత్మక ప్రదర్శనలు వీక్షకుల మదిని రంజింపజేశాయి. హుషారు గొలిపే నృత్యాలు, దేశభక్తి సందేశాత్మకతో కూడిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. 'వీరులం భారత రక్షణ సైనికులం' అంటూ ప్రదర్శించిన దేశభక్తి రూపకం, 'పాడుదామ స్వేచ్ఛాగీతం' అనే దేశభక్తి ప్రదర్శన, నాద వినోదం అనే క్లాసికల్ సాంగ్, ఓం నమఃశివాయ' భక్తి ప్రదర్శన, ఫోక్ సాంగ్స్ వంటి అనేక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతుల అందజేత జరిగింది. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అప్పుల సాగు

- గడచిన ఖరీఫ్ దిగుబడులు అంతంత మాత్రం
- ఆశలతో రబీ సాగు చేపట్టిన రైతులు
- నేటికీ రైతులకు అందని ప్రభుత్వ సాయం

కొత్తపేట: దేశానికి వెన్నెముక రైతు.. ఆ రైతు బాగుంటేనే దేశం బాగుటుంది... రైతు ప్రయోజనాలు కాపాడటమే ప్రభుత్వాల లక్ష్యం.. ఇవీ ప్రస్తుత పాలకుల ప్రకటనలు.. గడచిన ఎన్నికల్లో వారు రైతులకు ప్రోత్సాహం పెంచనున్నాం.. అభివృద్ధి బాటలో నడిపించనున్నాం.. అని ప్రకటించారు. ఇంతన్నారు.. అంతన్నారు. ఆచరణలో మాత్రం శూన్యం చూపించి ముఖం చాటేస్తున్నారు.

దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై ప్రకృతి కన్నెర్రజేసినా.. పాలకులు పట్టించుకోకపోయినా మళ్లీ గంపెడాశలతో వారు పంట సాగుకు ఆసక్తి చూపడం సాధారణమైపోయింది. వాతావరణ పరిస్థితులతో ఖరీఫ్‌లో దిగుబడులు ఆశించినంతగా రాకపోయినా.. ప్రస్తుతం కోటి ఆశలతో రబీ (దాళ్వా) సాగు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అండగా నిలబడకపోయినా అప్పులు చేసి మరీ పంటలు వేస్తున్నారు. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో రబీలో రైతులు వరినాట్లు పూర్తి చేశారు. దాంతో వరి ఆయకట్టు భూములు పచ్చగా కనిపిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో ఇప్పటికే కాలువల దిగువ ప్రాంతాల్లో మొదటి దఫా, ఎగువ ప్రాంతాల్లో రెండో దఫా ఎరువులు వేశారు. ప్రభుత్వం పథకాలు అమలు చేయక, ఖరీఫ్ పంట సొమ్ము దాదాపు ఆ పంట పెట్టుబడికి, అప్పులు తీర్చడానికి సరిపోయాయి. దాళ్వా పంటకు మళ్లీ అప్పులు చేయాల్సి వస్తుందని రైతులు వాపోయారు.

ప్రస్తుతం వరిసాగు ఇలా...

నియోజకవర్గం	సాగైన వరి (ఎకరాల్లో)	రైతులు
కొత్తపేట	25,063	14,555
పి.గన్నవరం	20,075	10,626
రాజోలు	7,106	3,444
మొత్తం	52,244	28,625

గత ప్రభుత్వంలో పండగలా సాగు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం పండగలా చేసుకున్నారు. అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని లాభసాటికి తీసుకురావాలనే లక్ష్యంతో వివిధ పథకాలు అమలు చేశారు. ఏటా రైతులకు రైతు భరోసా ద్వారా రూ.13,500 పెట్టుబడి సాయంగా అందించింది. దీంతో పాటు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచింది. ప్రకృతి వైపరీత్యాల్లో నష్టాలకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చింది. పంటల బీమా పథకానికి సంబంధించి రైతుల తరఫున, వారికి భారం లేకుండా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి, బీమా సాయం అందించి ఆదుకుంది. దీంతో రైతులు వ్యవసాయాన్ని పండగలా సాగు చేసుకున్నారు.



కొత్తపేటలో వరి చేనుకు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

రైతన్న కష్టాలు పట్టించుకోని ప్రభుత్వం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ విధానాలకు పూర్తి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తుంది. టీడీపీ కూటమి అధికారం చేపట్టాక గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు తుంగలో తొక్కేసింది. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా గాలికొదిలేసింది. రైతులకు సంబంధించిన పథకాలను అమలు చేయకుండా అప్పుల పాలవడానికి కారణమవుతుంది. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా నేటికీ ఒక్క రూపాయి సాయం అందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుకు ప్రభుత్వ ప్రోత్సాహం కరవు



ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రైతులకు ఏ విధమైన ప్రోత్సాహం కనిపించడం లేదు. ఎన్నికల్లో మాత్రం ఎన్నో ప్రగల్భాలు పలికారు. పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామన్నారు. గత వైఎస్సార్ సీపీ అమలు చేసిన రైతు భరోసా కూడా ఇవ్వలేదు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు అప్పులు చేసి పంటలు వేస్తున్నారు. రైతులు సహనం కోల్పోయి ఉద్యమించక ముందే ఇచ్చిన హామీలు అమలు చేసి, రైతులను ఆదుకోవాలి.

– పెదపూడి బాపిరాజు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ రైతు విభాగం, వాడపాలెం

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ఖరీఫ్‌లో ఆశించిన దిగుబడులు రాలేదు. వచ్చినపంట సొమ్ము పెట్టుబడి కింద సరిపోయింది. ఇప్పుడు దాళ్వాలో సొంతం, కౌలు కలిపి ఆరు ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నాను. ఇందుకు ఎకరానికి దాదాపు రూ.30 వేల వరకూ ఖర్చవుతోంది. ఈ ప్రాంతంలో తనతో పాటు దాదాపు అందరూ సాధారణ రైతులే ఎరువులు, పురుగుమందులకు అప్పు చేయాల్సి వస్తోంది. రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తే ప్రోత్సాహకరంగా ఉంటుంది.

– భూపతిరాజు సత్యనారాయణరాజు, రైతు, గంటి

ఘనంగా వీరభద్రస్వామి సంబరం



వీరభద్రస్వామి సంబరం నిర్వహిస్తున్న భక్తులు

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామంలోని పినిశెట్టివారి బాల వీరభద్రస్వామి సంబరం ఆదివారం వైభవంగా జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం, ప్రభ ఊరేగింపు, బాణసంచా కాల్పులు, నృత్యాల నడుమ వైనతేయ గోదావరి నది వరకు స్వామిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం నది వద్ద పినిశెట్టి వెంకటస్వామి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాల వీరభద్రస్వామి సంబరాన్ని పినిశెట్టివారి పాలెం ఆలయం వద్ద ఘనంగా జరిపించారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. విఘ్నేశ్వర పూజ, శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు బాల వీరభద్రస్వామికి శూలాలతో వీరనాట్యం చేస్తూ పరవశింపచేశారు. ఈ పూజలు ఆద్యంతం కనుల పండువలా నిర్వహించారు. పలువురు భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



45 ఏళ్ల తరువాత కలసిన విద్యార్థులు

మలికిపురం: దిండి టూరిజం కేంద్రంలో ఆదివారం పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. రాజోలు మండలం శివకోడు ఉన్నత పాఠశాలలో 1981–82లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరిగింది. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన నాటి విద్యార్థులంతా కలసి నాటి మధురస్మృతులను గుర్తుచేసుకున్నారు. 45 ఏళ్ల తరువాత కలసిన వారు రోజంతా ఆహ్లాదంగా, సంతోషంగా గడిపారు.

పెరుగుతున్న సూర్యతాపం

అంబాజీపేట: శీతాకాలం వెళ్లకుండానే సూర్యభగవానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మహాశివరాత్రికి చలి శివ శివా అంటూ వెళ్లిపోతుందని పెద్దలు చెబుతారు. శివరాత్రికి పది రోజులు ముందు నుంచే వాతావరణ ఉష్ణోగ్రతలు పెరుగుతూ వచ్చాయి. వేసవి ప్రవేశించకుండానే ఈ మేరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాధారణాన్ని మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత మూడు రోజుల్లోనే 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని అంబాజీపేట, పి.గన్నవరం, అయినవిల్లి, మామిడికుదురు మండలాల్లో నమోదవుతున్నాయి. దాంతో ప్రధాన రహదారులు మధ్యాహ్న సమయంలో వెలవెలపోతున్నాయి. దీన్ని బట్టి ఉష్ణోగ్రతలు ఏమేర పెరిగాయో అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది శీతాకాలం సీజన్లో చలి సైతం తక్కువేనని పలువురు పేర్కొంటున్నారు. దీంతో ఈ ఏడాది ఎండ తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 10 గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. సూర్యుని ఎండ తీవ్రతకు నాలుకలు తడారిపోతున్నాయని పలువురు వాపోతున్నారు. దీంతో కూలింగ్ వాటర్, జ్యూస్ సెంటర్ల వైపు క్యూ కడుతున్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు మేము సైతం సిద్ధం అన్నట్టుగా నిన్న మొన్నటి వరకు కానరాని ఫ్రూట్ జ్యూస్ సెంటర్లు మండల పరిసర గ్రామాల్లో కోకొల్లలుగా వెలిశాయి. మరో పక్క కొబ్బరిబొండాలు, పుచ్చకాయల విక్రయాల స్టాల్స్ పెరిగాయి. పుచ్చకాయలైతే ఆకుపచ్చ, పసుపు వంటి రంగుల్లో సైతం లభిస్తున్నాయి. ఎండ తీవ్రతకు ప్రజలు ఇప్పటి నుంచే గగ్గోలు పెడుతున్నారు.



ముక్కామలలో వెలవెలబోతున్న ప్రధాన రహదారి

సీతారామాలయంలో కోఆర్డినేటర్ ప్రత్యేక పూజలు



సీతారామాలయంలో పూజలు చేస్తున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు

అయినవిల్లి: మండలంలోని నేదునూరు గ్రామం వాసంశెట్టివారిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాలయ శంకుస్థాపనలో భాగంగా పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, అయినవిల్లి జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, నాయకులు కనుమూరి సత్యనారాయణరాజు, మట్టపర్తి వెంకటరమణ, వాసంశెట్టి తాతాజీ, పేరిచర్ల రఘురామరాజు, కామన కృష్ణమూర్తి, చిలువూరి సాయిరాజు, పులిదిండి ప్రభాకర్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేదస్మరణతో మానసికోల్లాసం

అయినవిల్లి: సనాతన ధర్మాన్ని వేదసారాల ద్వారానే తెలుసుకోవచ్చని వేదస్మరణతో, పఠనతో మానసికోల్లాసం అలవడుతోందని, తద్వారా భగవంతున్ని చేరుకోవచ్చని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్ దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో ఈ కృష్ణునికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ వేద శాస్త్రాలు ఏమి అయితే చెబుతున్నాయో వాటిని మానవులు ఆచరించాలన్నారు. ఇప్పుడు కొంత మంది నేనే భగవంతున్ని నాకే పూజలు చేయండి అంటూ దొంగబాబాలు పుట్టుకొస్తున్నారన్నారు. భగవంతుడు ఒక్కరే ఉన్నారూ ఆయన్నే సమస్త ప్రాణికోటి పూజలు చేయాలని ఆయన సేవలోనే తరించాలన్నారు. ఆయనే శ్రీకృష్ణ భగవానుడు అన్నారు. అనంతరం మందిరం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

నేడు, రేపు వాడపాలెం లాకుపై చానళ్లకు సాగునీరు

కొత్తపేట: ప్రస్తుత రబీ (దాళ్వా) పంటకు వంతుల వారీగా సాగునీటి సరఫరా విధానం అమలులో భాగంగా మండలంలోని వాడపాలెం లాకుపై ఉన్న చానళ్లకు సోమ, మంగళవారాలు సాగునీరు సరఫరా చేస్తున్నట్టు ఇరిగేషన్ శాఖ స్థానిక సెక్షన్ ఏఈ వి.నవీన్‌కుమార్ తెలిపారు. ఆ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బొబ్బర్లంక–ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువ ద్వారా మండలంలోని వాడపాలెం లాకులపైన వాడపాలెం ఓల్డ్, న్యూ చానళ్లకు సోమవారం మధ్యాహ్నం 12 నుంచి మంగళవారం మధ్యాహ్నం 12 వరకూ సాగునీరు సరఫరా చేయనున్నట్టు ఏఈ తెలిపారు. ఆయా చానళ్ల కింద కొత్తపేట, వాడపాలెం, బిళ్లకుర్రు గ్రామాల పరిధిలోని వరి ఆయకట్టుకు సంబంధించిన రైతులు వంతుల వారీ విధానంలో తమ భూములకు సాగునీరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధం

రావులపాలెం: స్థానిక కెనాల్ రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం ఒక ఎలక్ట్రిక్ స్కూటర్ ఒకసారిగా మంటలు వ్యాపించి దగ్ధమైంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా మార్టేరు సమీపంలో నెగ్గుపూడికి చెందిన సత్తి పెద్దిరెడ్డి ఆరా ఎలక్ట్రిక్ స్కూటర్ వేసుకుని పని నిమిత్తం రావులపాలెం వచ్చారు. స్థానిక కెనాల్ రోడ్డులో పెద్ద వంతెన సమీపానికి వచ్చే సరికి వాహనం నుంచి పొగలు రావడంతో వాహనాన్ని నిలిపివేసి దూరంగా వెళ్లిపోయాడు. దీంతో కొద్దిసేపటికి మంటలు చెలరేగి స్కూటర్ దగ్ధమైంది. అయితే మూడు సంవత్సరాలుగా ఈ వాహనం వాడుతున్నా, ఇటువంటి ఇబ్బంది రాలేదని, ఇప్పుడే ఇలా మంటలు వచ్చాయంటూ పెద్దిరెడ్డి తెలిపారు. అయితే స్కూటర్లో బ్యాటరీ, ఎలక్ట్రికల్ సర్క్యూట్ వద్ద మంటలు రావడంతో ఈ ఘటన జరిగి ఉంటుందని స్థానిక మోటారు సైకిల్ మెకానిక్‌లు అంటున్నారు.



మంటల్లో కాలిపోతున్న ఎలక్ట్రిక్ స్కూటర్

పోషకాల గని.. ఆరోగ్య ప్రదాయిని

అంబాజీపేట: వేసవి వచ్చిందంటే చాలు ప్రజల దాహార్తిని తీరుస్తూ ఎన్నో పోషక విలువలు మానవ శరీరానికి అందివ్వడంలో పుచ్చకాయ అద్వితీయమైన పాత్ర పోషిస్తుంది. పుచ్చకాయ పుట్టినిల్లు దక్షిణాఫ్రికా. ఎక్కువగా ఎరుపు రంగులో ఉన్నప్పటికి ప్రస్తుతం పసుపు, పాల పసుపు, నారింజ తదితర రంగుల్లో కూడా లభ్యమవుతున్నాయి. కొవ్వు శాతం తక్కువ ఉన్న పుచ్చకాయలో చాలా మంది ఎర్రటి గుజ్జును మాత్రమే తింటారు. కాని శాస్త్రవేత్తల ప్రకారం ఎర్రటి గుజ్జు కింద ఉండే తెల్లని గుజ్జులో కూడా ఎన్నో పోషకాలున్నాయని చెబుతున్నారు. అలాగే పుచ్చకాయ గింజల్లోనూ ఎన్నో పోషకాలు ఉన్నాయి. పుచ్చకాయ గింజలను ఎండబెట్టి పొడి రూపంలో తిన్న శరీరానికి ఎంతో మంచిది. కొన్ని దేశాలలో పుచ్చగింజల నుంచి నూనె తీస్తారు. పుచ్చకాయలో సెట్రాలీస్ అనే ఫైటో న్యూట్రియంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉన్న ఇతర ఎంజైములతో కలిపి ఆర్గనైన్ అనే అమినో ఆమ్లంగా మారుతుంది. దీని వల్ల గుండె పనితీరు, రక్త ప్రసరణ మెరుగుపడటం, రోగ నిరోధక శక్తి పెరగటం జరుగుతుంది. పుచ్చకాయల్లో సుగర్ బేబి, అపాయి యమటా, జర్కజ్యోతి, ఆర్యా మానిక్, దుర్గా పూర్ రేసస్, మీరా, వసుధ, పుప్రీత్, అపూర్వ, స్వీట్ డ్రాగాన్, మహారాజా, నేత్రాపతి, మాధురి తదితర రకాలున్నాయి. పుచ్చకాయ సాగుకు 23 నుండి 32 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత అనుకూలం.



అంబాజీపేటలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం

మామిడికుదురు: ఎన్డీఏ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకురావాలని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము పేర్కొన్నారు. పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఆదివారం మండల శాఖ అధ్యక్షుడు రామును మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. రాము మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి అధికారం చేపట్టి తొమ్మిది నెలలైందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కదాన్ని పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. వీటిపై విస్తృతంగా ప్రచారం చేపట్టాల్సి ఉందని చెప్పారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్, పార్టీ నేతలు చిక్కం బుజ్జిబాబు, గెద్దం వెంకటేశ్వరరావు, బాలం రమేష్, పొలమూరి విక్రమ్, బత్తుల జనార్దనరావు, తదితరులు ఉన్నారు.



రామును సన్మానిస్తున్న పార్టీ నేతలు

హెల్మెట్ ధారణపై పోలీసుల వినూత్న ప్రచారం

అమలాపురం టౌన్: కొత్తగా వచ్చిన ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ధారణపై అమలాపురం పోలీసులు వినూత్న ప్రచారం చేస్తున్నారు. వాహన చోదకులకు అవగతమయ్యేలా మరికొన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. 'ప్రభూ..హెల్మెట్ లేదు... వేసేయ్ మంటావా' అంటూ చిత్రగుప్తుడు యమ ధర్మరాజుకు చెబుతున్నట్లు, ఆ పక్కనే హెల్మెట్లు లేకుండా ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వెళుతున్న దృశ్యాలు ఫ్లెక్సీల్లో ముద్రించి ప్రచారం చేస్తున్నారు. అలాగే లలిత జ్యూయలర్స్ ప్రకటన కోసం ఆ సంస్థ యాజమాని మాట్లాడుతున్నట్లుగా 'డబ్బులు ఊరికే రావు' అంటూ హెల్మెట్ లేకపోతే జరిగే ప్రమాదంతో ఆస్పత్రి పాలైతే డబ్బులు చెల్లించే అంశంపై హెచ్చరిస్తున్న వైనాన్ని ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేయడంతో ప్రజలు వాటిని ఆసక్తిగా తిలకించి చదువుతున్నారు. పట్టణ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు ఈ ఫ్లెక్సీలను పట్టణంలోని పలు రోడ్ల చెంత ఏర్పాటు చేశారు.



ఆకట్టుకున్న చిత్రగుప్తుడు, యమధర్మరాజు ఫ్లెక్సీ

కాశీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

అమలాపురం టౌన్: క్రీడాభివృద్ధికి పరితపించిన జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ రిఫరీ దివంగత రంకిరెడ్డి కాశీ విశ్వనాథం కాంస్య విగ్రహాన్ని ఆఫీసర్స్ క్లబ్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని క్రీడా సంస్థల ప్రతినిధులు, క్రీడాకారులు సూచించారు. స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ (ఇన్‌డోర్ షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు)లో వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కాశీ సంతాప సభలో క్రీడా సంస్థల ప్రతినిధులు, క్రీడాకారులు కాంస్య విగ్రహం ఏర్పాటుపై చర్చించారు. సంతాప సభకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు మాట్లాడుతూ కాశీ కాంస్య విగ్రహం ఏర్పాటు ఆవశ్యతకను వివరించారు. సభకు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అధ్యక్షత వహించారు. కాశీ మరణం జిల్లా క్రీడా రంగానికి తీరని లోటని వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర అన్నారు. క్లబ్ ప్రతినిధులు డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ రాఘవేంద్రరావు, పుత్సా కృష్ణ కామేశ్వర్, నూకల సత్యనారాయణ, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు అనంతలక్ష్మి తదితరులు హాజరయ్యారు.



కాశీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు